


# భేతాళ కథ

ఉదోగ్యమూ, ఆ వూరూ రెండూ నాకు క్రొత్తే. ఏమీ తోచక సాయంకాలం అలా ఏకాంతంగా వాహ్యాళి వెళ్లాను.

రంగు-రంగుల సీతాకోక చిలుక ఒకటి రెక్కలాడించుకుంటూ— పసుపు-పచ్చటి తంగేడుపూల గుత్తులను ముద్దులాడు తున్నది. క్రొత్త పరిసరాల్లో ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ—పచ్చికమీద మర్రిచెట్టు ఊడకు ఆనుకుని కూర్చున్నాను.

ఒకప్రక్క—రాళ్ళు ప్రోగు వేసినట్లు చిన్నగుట్ట, చుట్టూ—పూతతో నిండి కళ - కళ లాడుతున్న పచ్చటి వేరుశనగ చేలు. ఆ చేల కంచెల చుట్టూ-పచ్చటి పూలను కొప్పులో తురుముకొని ముచ్చట్లాడే తంగేడు మొక్కలు, మైలున్నర దూరంలో వున్న ఆ చిన్న వూరును కనిపించనీయకుండా కప్పేస్తూ—మామిడి, చింత, వెలగ మొదలైన

తోపులు, ప్రక్కన ఎర్రటి కాలిబాట, దాని కట్టుప్రక్కన ఎండిపోయిన కొండవాగు, ప్రియుని చుంబనంతో ఎరుపెక్కిన క్రొత్త పెళ్లికూతురి చెక్కిలిలా--పశ్చిమాకాశము ...ఈ సౌందర్యం కాలాన్ని ముందుకు సాగనంపి, నా మనస్సును, తనువును కళ్లెంవేసి తన సాన్నిధ్యంలోనే నిలుపు కొంది.

తెరలు తెరలుగా వచ్చి పొరలు పొరలుగా పరదాలు నిర్మించుకుంటున్న సంజ చీకట్ల భీకరాకృతి ఊహాసౌధాగ్రంనుండి నన్ను క్రిందికి ఒక్క తాపు తన్నింది. ఆ మసక చీకట్లలో——దూరంగా కాలిబాట మీద ఎవరో యిద్దరు-ముగ్గురు గ్రామీణులు నడిచి పోతున్నారు. గుట్టకు ఆ చివరనుండి అంబారవం వినిస్తోంది. అడవి పిట్టల వింత శబ్దాలు మిన్నుముట్టు తున్నాయి.

ఏకాంతం!...

అది పెద్ద మర్రిచెట్టు. చుట్టూ నాలుగైదు ఊడలు దిగి, నేలలోనికి పాతుకుపోయి వున్నాయి. గుబురు టాకులలో క్రిక్కిరిసి, నింగిలోనికి చొచ్చుకుపోయి, నిత్యమూ చీకటికి ఆలవాలంగా వున్న కొమ్మలు...నాకెందుకో ఆ క్షణంలో భేతాళకథలు జ్ఞాపకం వచ్చాయి. విక్రమార్కుడు, భేతాళుడు, మర్రిచెట్టు, అర్థరాత్రి, భేతాళుడు చెప్పేకథా ఒళ్లు గగుర్పొడిచింది. కనుచూపు మేరలో మనుషుల జాడలేదు. ఆవరించుకొన్న చీకటిలో ప్రకృతి వికృతాకృతి!

దయ్యాలు, భూతాలూ వున్నాయంటే నే నెప్పుడూ నమ్మలేదు. అయినా నాకెందుకో భీతికలిగింది. కారణం— క్రొత్త పరిసరాలు, ఏకాంతం, అరచితే అందుబాటులో లేని ఊరు, నా చేతికి గడియారం, వ్రేలికి ఉంగరం...దయ్యం పీడిస్తుందట!...మనిషి దయ్యమై మరోమనిషిని పీడించ డానికి తగిన అవకాశము, పరిస్థితి యిక్కడ వున్నాయి.

త్వరగా ఊరు చేరుకోవాలనుకుంటూ పైకి లేవ బోతున్నాను. ఆ రెండో క్షణంలోనే నాకూ దెయ్యాల పట్ల భయవిశ్వాసాలున్నాయన్న సంగతి తేలిపోయింది. మర్రి కొమ్మలోనుండి ఒక నల్లటి ఆకారం ముద్దలా దభేలున నాముందర వచ్చిపడింది. గుండె తారుమంది. భయంతో "హమ్మోయ్!" అన్నాను. ఆ ఆకారం పొగలాగా పైకి లేచి నిలబడింది. విరగబడి నవ్వుతున్నది. గుండె సర్దుకుంటూ, కళ్ళల్లో వత్తులు వెలిగించుకుని ఆ ఆకారాన్ని పారజూచాను. కట్టెలాంటి పొడుగాటి దేహం! నల్లని రంగు!... జుత్తు, గడ్డం గుబురుగా పెరిగి చీకిపొదల్లా వున్నాయి. పుర్రెలాంటి ముఖం!... మిణుగురు పురుగుల్లా వెలిగే కళ్లు! చీకిరి బాకి రిగా చిరిగిపోయి పేలికలు వ్రేలాడే మురికిబట్టలు... అన్నీ కలిపితే అది ఒక భయంకర మూర్తి!

"అహాహాహీహూహూహో! జడుసుకున్నావా? ఛీఛీఛీ! గడుసువాడి వనుకున్నానే!..." అంటూ నవ్వుతున్నది ఆ మూర్తి.

"ఎవరు నువ్వు? అలా దూకావెందుకూ?" అన్నాను.

"చెబుతా... చెబుతా..."

"నువ్వేంచెప్పకు! నేవెళ్తున్నా" అంటూ ముందుకు కదిలాను. ఆ ఆకారం గట్టిగా నా చెయ్యి పట్టుకొంది.

"ఆగు..."

"ఎందుకూ?"

"పనుంది. ఓ కథ చెబుతా...విను..."

నాలో అనుమానమూ, భయమూ యినుమడిస్తున్నాయి. దొంగతనాలు రకరకాలు. కొందరు ఘరానా దొంగల చౌర్య ప్రక్రియల్ని కీర్తించకుండా వుండలేము.

చేయి విడిపించుకుని, "అబ్బే!—ఎందుకులే?... ఆ కథ మరెవ్వరికైనా వినిపించుకో! నాకు వేరేపనుంది..." అంటూ ముందుకు సాగవారాను. "సరేపోనీ! నేనూ నీతో బాటే వస్తా...కథ చెబుతూ..." అంటూ ఆ వ్యక్తి నా వెంటబడ్డాడు. అడుగులు త్వరత్వరగా వేస్తున్నాను. తూరుపు కొండమీద నిండుచంద్రుడు తొంగిచూస్తున్నాడు.

"ఓ ఊళ్ళో ఓరాజు, ఆరాజు పేరు..." అంటూ ఆగిపోయాడు ఆ వ్యక్తి. "నువ్వు ఊకొట్టాలిమరి" అంటూ మళ్ళీ ప్రారంభించాడు. "ఓ ఊళ్ళో ఓ రాజు..."

నేను వూకొట్టలేదు.

"ఊఁ కొట్టవేం?" అన్నాడు గద్దించి.

"పైగా యిదొకటా! ఆ కొట్టేదేదో నువ్వేకొట్టు."

"ఓహో! కొడతా...అలాగే కొడతా! చేత్తో గొట్టమంటావా? రాత్తో కొట్టమంటావా?" అంటూ చివాలున ఆగాడు. నాకు ఒళ్లు కంపరమెత్తింది.

"సరే! ఊఁకొడతా!"

"అలా రా దారికి! ఓ వూళ్ళో ఓ రాజు..."

"ఊఁ!" నేను ఊఁకొట్టుతుండగా కథ ముందుకు సాగింది.

"ఆ రాజు పేరు పేర్రాజు! ఆ పేర్రాజు అమ్మపేరు దేవమ్మ. వాడికి దేవమ్మే దేవుడు. ఆమె మాటంటే వాడికి కిరీటం—అంటే శిరోధార్యం! రాజ్యం పేర్రాజుదేగానీ పరిపాలనంతా దేవమ్మదే! పేర్రాజు తల్లిచాటుబిడ్డ. పంజరంలో చిలుక. ఆమె చేతిలో కీలుబొమ్మ. అయినా వాడు మంచిబిడ్డ. నోట్లో వేలు బెట్టినా కొరకడు. మిద్దింటి రంగసాని ఒయ్యారంగా ఒళ్లు విరుచుకుని, ఓరగా చూచి నవ్వినా వాడికేమీ తెలీదు. తానేమో, తన చదువేమో! పేర్రాజు చదువుకున్నాడు సుమా! అయినా, చదివేవాడు చదువుకుంటూ వుండిపోయివుంటే బాగుండేది పాపం! ఆ పిచ్చమ్మను తెలుసా నీకు?"

"ఏ పిచ్చమ్మ?" అని అడిగాను.

"పొరుగూరి రాజు పెళ్ళాం. ఇప్పుడు దానికి యిద్దరు పిల్లలు గూడాను. మనవాడు దాన్ని కాస్తా ప్రేమించేశాడు. ఇది ఈనాటి సంగతి కాదు సుమా! చిన్నప్పటి సంగతి. అది కూడా వీణ్ణే వలచేసింది. ఇద్దరూ మనసులు మార్చు కున్నారు."

"అంతలో ఏమొచ్చింది—ప్రళయం?"

"మార్చుకోడమంటే ఏమిటీ? ఒండొరులు మార్చు కున్నారు, ఉంగరాలు మార్చుకున్నట్లు. నువ్వు లేకపోతే నేను పిచ్చివాణ్ణయిపోతాను అన్నాడు పేర్రాజు. నువ్వు లేక పోతే నేను బతికినా, చచ్చినట్టే—అంది పిచ్చమ్మ. ఊరి బయట ఒక పెద్ద మర్రిచెట్టు. ఆ చెట్టుక్రింద కలుసుకునే వారు. ఊడలెక్కి ఉయ్యాలలూగేవారు. గుట్టమీదికి పరుగు లెత్తేవారు. కొండవాగులోని ఎండు టిసుకలో పడి దొర్లే వారు. తాము ఎడబాటు భరించలేమనీ, ప్రతిరోజు తాము కలుసుకునే ఘడియలు మినహాయించి మిగతా కాలాన్ని తమ ఆయుస్సులో నుంచి తీసిపారవేయమని విధిని కోరుకునే వారు. పేర్రాజు కంటికి ప్రపంచమంతా పిచ్చమ్మ. పిచ్చమ్మ కంటికి ప్రపంచమంతా పేర్రాజు.

ఒకరోజు మర్రిచెట్టుకింద, పచ్చని పచ్చికమీద పిచ్చమ్మ పేర్రాజును కౌగలించుకొని ఏడుపు అందుకొంది. ఎందు కేడుస్తావని అడిగాడతను. "మా నాన్న నన్ను చీవాట్లు పెట్టాడు. పెద్దవాళ్ళతో స్నేహం నిప్పుతో చెలగాటం—

అని మందలించాడు. నేను నీతో ఆడుకోకూడదట. పాడుకో కూడదట. మాట్లాడరాదట. అసలు చూడనే కూడదట!...'' అంటూ భోరుమంది ఆమె. ''ఓసి పిచ్చిదానా! నువ్వు పిచ్చిదానివి! నిజంగా పిచ్చిదానివి. నీకెందుకు భయం! నేనున్నాగా! మా అమ్మకు నేనంటే పంచప్రాణాలు. నాపిచ్చీ! నాపిచ్చి పిచ్చీ! నువ్వెక్కడికీ పోవు. నాదగ్గరే వుంటావు. ఎప్పుడూ నా దగ్గిరే వుంటావు. సత్యం...'' అన్నాడు పేరిరాజు.

వాడి చేతిలో ఏముంది? పైన దేవుడొకడున్నాడుగా! దేవమ్మ భీష్మంగా శాసించేసింది—''వీల్లేదు. దాన్ని తెచ్చి నీకు కట్టబెట్టమంటావా? ఆ పిచ్చిదాన్ని? నీకేం—మహా రాజువి! నీకు పిల్ల నియ్యడానికి ఎంతమంది పడిగాపులు కాస్తున్నారో తెలుసా? ఆ పిచ్చమ్మను తెచ్చుకుంటే నీ వంశం పిచ్చిదైపోతుంది'' అని.

పిచ్చమ్మ వంశాన్ని గురించి కొన్ని కథలున్నాయి. ఆమెది వెర్రిబాగులవంశమట! ఆమె తల్లికి పిచ్చట! ఆ పిచ్చితో ఆమె మొగుడిపైన అలిగి, ఉరిబోసుకు చచ్చి పోయిందట! ఆమె తాత-నడకమీద సీమకెళ్ళి చక్రవర్తితో మాట్లాడి వస్తానని చెప్పి వెళ్ళినవాడు చక్రవర్తి దగ్గరనుంచి యింకా తిరిగి రాలేదట! ఈ సంగతులంతా ఏకరువు పెట్టి ''మనకాపిల్ల వద్దు'' అంది దేవమ్మ.

పేరిరాజు బుంగమూతిపెట్టాడు. ''అమ్మా! నాకు మిఠాయి కావాలంటే నువ్వు కాదనలేదు. బొమ్మలు కొని

ప్పుంటే వెనకాడలేదు. ఇప్పుడుమాత్రం నన్నేడిపించడం దేనికి? నాకు పిచ్చమ్మ కావాలి. తెచ్చిపెట్టు!'' అన్నాడు. ఆమె వినలేదు. పేర్రాజు బావురు మన్నాడు. అలిగాడు. అన్నం ముట్టనన్నాడు. ''నువ్వు ఒకపూట అన్నం ముట్టక పోయినా ఫరవాలేదు గానీ—తరతరాలు నీ వంశాన్ని చెదలు ముట్టుకుంటే మాత్రం నేను సహించలేనురా నాయనా!'' అంది దేవమ్మ.

''అయినా సరే, నాకు పిచ్చమ్మే కావాలి. అది పిచ్చమ్మ కాదే! అపరంజి బొమ్మ! నాకా బొమ్మను తెచ్చిపెట్టవూ?'' అంటూ రోజులతరబడీ మారాం చేశాడు పేర్రాజు. ప్రయోజనం లేకపోయింది. దేవమ్మ ఒక గిరిగీచి, ''ఈ గీటు దాటకుసుమీ'' అంది. వాడు ఆ గీటు దాటలేదు.

ఆ గీటుకు అవతలనే—పిచ్చమ్మకు పెళ్ళి అయిపోయింది. ఆమెను పొరుగూరు రాజు పెళ్ళి చేసుకున్నాడు...''

* * *

...కథకుడు కథ ఆపాడు.

సుమారు ఒకటిన్నర ఫర్లాంగు దూరంలో ఊరు కనిపిస్తున్నది. గుడ్డిదీపాలు మినుకు - మినుకు మంటున్నాయి. ప్రాణం లేచి వచ్చింది. నా మనస్సు మనస్సులో లేకపోయినా—ఒకవైపు కథ శ్రద్ధగానే వింటున్నాను. ఈ మనిషి ఆకాశంనుండి వూడి పడడమేమిటీ, నావెంట బడడమేమిటీ, ఈ కథ చెవిని పడవేయడ మేమిటీ—విచిత్రంగానే

వుంది...ఆ కథ అటుంచి, ఈ మనిషి దాన్ని నాకెందుకు చెప్పినట్లు?

...ఇక కొసమెరుపుగా అతను తానే భేతాళుడై, నన్ను విక్రమార్కుణ్ణి జేసి, ఒక సమస్యనిచ్చి విప్పుకో మన్నాడు. "కథంతా విన్నావుగదా?—పిచ్చమ్మకు పెళ్ళి అయిపోయింది. ఆమె అత్తవారింటికి వెళ్ళిపోయింది. పొరుగూరి రాజుగారింట్లో కాపురం చేస్తోంది. అయినా ఆమె అక్కడుండటం పేరుకు మాత్రమే! నిజానికి ఆమె దేవమ్మ యింట్లోనే వుంది. దేవమ్మ యిల్లే పిచ్చమ్మకు మెట్టినిల్లు!... దీని భావమేమి తిరుమలేశ..."

కాని నేను విక్రమార్కుణ్ణి కానుగా! అర్థంకాలేదు. కష్టంగా తోచింది. ఆలోచించగల మానసికస్థితి కూడా అప్పుడు నాలో లేదు. "చెప్పవూ?" అన్నాడు అతను.

"ఊహుఁ!"

"అంతేనా? ఓరి దద్దమ్మా!..." అని వికవికా నవ్వి, వెనుదిరిగి, మర్రిచెట్టు వైపుగా రివ్వున వెళ్ళిపోయాడు ఆ 'భేతాళుడు'.

ఆశ్చర్యం నా చుట్టూ వలపరచుకొంది.

ఆ భేతాళుడి మార్కు కథకు, చివర మిగిలిపోయిన సమస్యకు సమన్వయం ఏమిటీ?...ఉరుములా వచ్చి మెరుపులా మాయమైన ఆ భేతాళుడెవరు? సమాధానాలు నా ఆలోచనకు అందలేదు.

ఎదురైన ఒక మనిషిని అడిగాను "అతడెవరు?" అని.

"ఓహో! అతడా? పాపం - పిచ్చివాడు!" అంటూ వెళ్ళిపోయాడు అతను.

అయినా పిచ్చివాడి మాటలని నేను త్రోసి పార వేయలేదు. ఊళ్ళోకి ప్రవేశించాను. ఎదురుపడ్డ ఒక పరిచితుణ్ణి అడుగుదా మనుకున్నాను. "ఈ వేళ ఊరిబయట మర్రిచెట్టుదగ్గర ఒక పిచ్చివాడు తటస్థపడ్డాడు..."

"కథ వినిపించాడా?" అన్నాడు ఆ పరిచితుడు.

"ఔను. ఎవరతను?"

"అతనే పేరాజు!"

★★